# ఆకాశ చిత్రాలు

## ఆర్. యం. చిదంబరం

[తెల్లటిబట్టమీద మసి అంటుకున్నట్టు నిర్మలాకాశంలో అక్కడక్కడా మబ్బులు కమ్ముకున్నాయి. ఉరుములతో వర్షంపడే సూచనలు కనిపించాయి.]

'ఎవర్రా ఆ టక్కులాడి?'

ఏదో నవల చదువుతున్న రమణ వులిక్కిపడి తిరిగిచూశాడు. కళ్ళల్లో నిప్పురవ్వలు చెరగుతూ కాళికామ్మవారిలా కమల దర్శనమిచ్చింది. అతనుకూడా కొద్దిగా కంగారుపడ్డాడు.

'చంపేశావ్ అక్కా!.. మా కాలేజీలో అందరూ 'మిస్ ఇండియా' అని నామకరణం చేసి మక్కువగా పిలుస్తుంటే నువ్వేమో టక్కులాడి అంటున్నావ్? పాపము శమించుగాక! పోతే ఆమెగురించి వివరాలు-బి. ఏ. మొదటి సంవత్సరం చదువుతూంది మెకానిక్స్ పోర్షన్ బావగారే బోధిస్తున్నారుకనక ఏదైనా సందేహనివృత్తి కోసం గురు దర్శనార్థం శిష్యురాలు వచ్చివుండవచ్చు' అని వ్యాఖ్యానించాడు రమణ.

అతని మాటలు అగ్గిలో ఆజ్యంలా పనిచేశాయి

'ఓహో!. అదాసంగతి' అంటూ వురిమింది

'అమ్మాయ్!. అన్నం మాత్రం వడ్డించి వెళ్ళిపోయావ్!' అంటూ మామగారు వంటింటోంచి కేక వెయ్యగానే లోపలికి పరుగెత్తింది కమల.

కమల యంత్రంలా తనపని తను చేసుకుపోతున్నా ఆమె మనసుమాత్రం గంట క్రితం జరిగిన సంఘటన మీదే వుండిపోయింది '[ప్రకాశంగారున్నారా?' అంటూ ఆ అమ్మాయి అరుగుమీదున్న కమలను ప్రశ్నించింది. ఆ అమ్మాయి సౌందర్యాన్ని రెప్పవాల్చకుండా గమనిస్తున్న కమల వెంటనే సమాధానం యివ్వలేకపోయింది ఆ మధుర స్వరం యేడమెట్లు ఎగబ్రాకి వెళ్ళి ప్రకాశం చెవుల్లో గిలిగింతలు పెట్టింది గామోలు! . అతను చకచకా దిగివచ్చాడు.

'ఓ!. సుశీలా? నువ్విట్లా హఠాత్తుగా దిగుతావని నేను కలలోకూడా అనుకోలేదు. రా! మేడమీదికిపోదాం' అంటూ ప్రకాశం వుత్సాహంతో సుశీలను మేడమీదికి తీసుకుపోయాడు, కమల ఏవీ అర్థం కాక అయోమయంగా చూస్తూ చివరి మెట్టుదగ్గర నిలబడింది. మేడమీది సంభాషణ స్పష్టంగా ఆమె చెవుల్లో పడింది.

'సుశీలా!.. నువ్విట్లా నడుచుకుంటే చివరికి కథ అడ్డం తిరుగుతుంది. నువ్వివేళ మా యింటికొచ్చేట్టు సూచనగానైనా చెప్పివుంటే, వద్దని ఖచ్చితంగా చెప్పేవాడిని. నాన్నగారు ఏమనుకుంటారు? అంతవరకెందుకు? కమల నన్ను బతకనిస్తుందా? మనం వేసుకున్న కార్యక్రమం సవ్యంగా జరగటానికి ఇది మార్గంకాదు. ఒక్కొక్క మెట్టు ఎక్కాలికాని ఒకేసారి ఎగిరిగంతితే క్రింద పడతాం- అంతే.'

'క్షమించండి ఇంకెప్పుడూ మీ అనుమతి లేనిదే రాను'

కమలకు తనకాళ్లకింద భూమి కదలుతున్నటనిపించింది ఇంక అక్కడ నిలబడలేకపోయింది ఆమెలో చిత్రవిచిత్రాలైన భావాలు మొలకెత్తాయి. నిజంగా ప్రకాశమే ఇట్లా మాట్లాడాడా? ఆమె నమ్మలేకపోయింది. పెళ్ళై సరిగ్గా సంవత్సరంకూడా పూర్తికాలేదు ఇంతలో తనంటే అసహ్యం కలిగిందా? సుశీల కళ్ళముందు మెదిలింది— గుండ్రటి మొహం— కాటుకకళ్ళ చిలిపి నవ్వు—యౌవన శోభను ప్రదర్శించేట్టు ఆమె ధరించిన దుస్తులు—కమలహృదయం అసూయతో నిండిపోయింది—పానకంలో పుడకలా ఈ సుశీల ఎక్కడ దాపరించింది? మామగారు భోజనం ముగించుకుని పడకకుపక్రమించారు.

కాలేజికి వెళ్ళిన ప్రకాశం తిరిగివచ్చాడు.

'మరేం లేదు కమలా!.. ఇవేళ సాయంత్రం మనం సినిమాకు వెడదామని ప్రోగ్రాం వేసుకున్నాం కదూ! ఇవేళ నాకోచిన్న ఎంగేజిమెంటు వుంది. దానికి వెళ్ళక తప్పదు పాపం! నువ్వేమో నాకోసం కాచుక్కూచుంటావ్ ఎంత ఆశాభంగం కలుగుతుందో ఆలోచించు! అది చెప్పిపోదామనే తిరిగివచ్చాను కోపం రాలేదు కదా?' అంటూ అటూ యిటూ చూసి (నాన్నగాని, రమణకాని చూస్తారేమోనన భయం) మెల్లిగా బుగ్గగిల్లి 'టా! టా!' అంటూ తిరిగి వెళ్లిపోయాడు

కమల చలనంలేని రాయిలా నిలబడిపోయింది. అతనికి తన మీదున్న అనురాగడి




### పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, నీ సరియైన చర్యనుగురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన నీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డువ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు 1-4-0 లకు మాత్రము వి పి. గా పంపగలము (వి పి చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపబడును వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించిచూడుడు మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City

... అంతరాంతరాల్లోంచి రావటంలేదనే సందేహం ఆమెలో మొలకెత్తినప్పుడు అతని మాటల్ని, చేష్టల్ని ఎలా విశ్వసించగలదు? ఎలా సహించగలదు?

మొదట్లో ప్రకాశాన్ని చేసుకోటానికే భయపడింది. అతను కాలేజీలో లెక్చరరని, సగానికిసగంమంది వయసొచ్చిన ఆడపిల్లలే అతని దగ్గర చదువుకుంటున్నారని విని హడలిపోయింది అంతే కాకుండా నూటికి అరవైమంది 'ఆడ పేషర్లు.' ఏ క్షణం ఎలా వుంటుందోనని భయపడుతూనే వచ్చింది.

చివరకు తుఫాను మొదలైందన్నమాట!

* * *

[ఆకాశమంతటా మబ్బులు కమ్ముకున్నాయి చిన్నగాలివిసురు కూడా మొదలైంది. భీకరంగా గగనం గర్జింపసాగింది.]

గడియారం ఏడు గంటలు చూపెడుతోంది.

భర్తకు అత్యంతప్రియమైన ఆకుపచ్చ చీర కట్టుకుని గులాబీరంగు వెల్వెట్ చోళీ తొడుక్కుని-కళ్లకు కాటుక పెట్టుకుని అతని రాక కోసం ఎదురుచూస్తూ నిలబడింది కమల. ఆమెకు జ్ఞాపకం వున్నంతవరకూ ఒక్కనాడు కూడా భర్త ఇంటికి రావటానికి ఇంత ఆలస్యం చేయలేదు. పరిస్థితులన్నీ ఆమెకు ప్రతికూలంలా కనిపించాయి. ఒక్క సంవత్సరంపాటు కష్టపడి పునాదులువేసి నిర్మించిన ఆశాసౌధాలన్నీ అథఃపాతాళానికి క్రుంగిపోతున్నట్టనిపించాయి.

గోడగడియారం ఎనిమిది కొట్టింది.

కాని ప్రకాశం రాలేదు. సినిమాకు వెళ్ళటం వీలుపడకపోయినా కనీసం షికారన్నా వెడదామనుకుంది. ఒకవంక ఉడుకుమోత్తనం—మరోవంక ఆశాభంగం మూలంగా వెల్లుబుకుతున్న దుఃఖం.

చివరకు రవణే తిరిగొచ్చాడు.

'ఒరేయ్ రవణా!.. నీకు ఇంటిసంగతి జ్ఞప్తివుందా?.. అచ్చోసిన ఆంబోతులా వూరంతా తిరుగుతున్నావే?' అంటూ తన కోపాన్నంతా అతనిమీద వెళ్ళగక్కింది.

'అదేవి టక్కా!...ఒక వేళ నాకు జ్ఞాపకం లేకపోయినా ఆత్మారాముడు వూరుకుంటాడూ!. అసలు జరిగినసంగతిది... పాపం! నువ్వీ వార్త విని ఇంకా బాధపడతావని నాకు తెలుసు-అయినా ఏం చెయ్యను? చెప్పకతప్పదు. అది నా విధి. కాలేజీ విడిచిపెట్టాక తిన్నగా గాంధీపార్కుకు వెళ్లాను. ఏదో స్పెషల్ రేడియో ప్రోగ్రాం వుందని. అందుచేతే ఆలస్యమైంది... అన్నట్టు అక్కడ బావగారిని చూశాను.'

'ఓహో!..ఇదేగా మోలు ఎంగేజిమెంటు!' అంటూ బుసకొట్టింది కమల.

'అంతా పూర్తిగా విను మరి.. బావగారితోపాటు మిస్ ఇండియాకూడా వుంది.'

'ఏవిటి?' కమల కంఠంలో వణుకు వినిపించింది.

'అదే!.. సూక్ష్మీకరించి చెబితే బావగారూ, సుశీలకలిసి గాంధీపార్కులో చలటి పిల్లగాలుల సౌరభాన్ని గ్రోలుతున్నారు' అంటూ తన వ్యాఖ్యానాన్ని ముగించి ఇంట్లోకిపోయాడు.

వెయ్యి పిడుగులు నెత్తిమీదపడ్డట్టు కమల అక్కడే కూలబడిపోయింది. పోనీ, మామగారితో చెబితేనో!.. ప్రకాశానికి తన తండ్రంటే అపరిమితమైన భయమన్న సంగతి కమలకు బాగా తెలుసు. కాని ఇంతటి స్వల్పవిషయానికి ఫిర్యాదుచేస్తే బాగుంటుందా? అదీకాక చివరకు తన సందేహాలు నిరాధార సందేహాలవుతాయేమో!...చివరకు కంగారు పడకూడదని నిర్ణయించుకుంది.

ప్రకాశం తొమ్మిదిగంటలకు ఇల్లు చేరుకున్నాడు.

రోజూ సరదాగా కబుర్లు చెబుతూ వడించే కమల మౌనంగా వున్నప్పటికి అతను మాత్రం వుత్సాహంగా చెప్పుకుపోయాడు.

"ఇంటికి రావటం ఆలస్యమైనందుకు నీకు కోపంగావుంది కదూ!.. ఇవేళ నాకు ఓ ప్రైవేటు దొరికింది. లక్ష్మీ వస్తుంటే మోకాలు అడ్డం పెట్టటమెందుకని ఒప్పుకున్నాను. అందుకే ఆలస్యమైంది - ఇంక ప్రతిరోజూ ఇంతే ననుకో!.. అన్నట్టు పొద్దున్న ఓ అమ్మాయి వచ్చింది చూశావా! అప్పుడే చెబుదామనుకుని మర్చిపోయాను. ఆ అమ్మాయి నాస్టూడెంటు-ఆమెగుణగణాలు ఉత్తమోత్తమమైనవి. వృధాగా అపోహలు పడతావని నా భయం.'

'ఇన్నాళ్లూ మీ మాటలు విశ్వసించాను. ఇకముందు నా జాగ్రత్తలో నేను ఉండకపోతే మొదటికే మోసం వస్తుంది' అని కమల తీక్షణ వీక్షణాల హెచ్చరికను అతను గమనించనే లేదు.

* * *

[ఉరుములు ఎక్కువయ్యాయి ఎక్కడో రెండుమూడు పిడుగులు పడేవుండవచ్చు. కళ్లు చెదరేటట్టు మెరుపులు—'ఇంక ఏ క్షణంలోనైనా బ్రహ్మాండమైన వర్షం పడవచ్చు' అన్నట్లుగా వుంది ప్రకృతి.]




## అతిమూత్రవ్యాధి నెమ్మదించును

మూత్రంలో చక్కెరపోవటం అతిమూత్రవ్యాధి (DIABETES) అంటారు. ఇది ఎంత ఉపద్రవకరమైన వ్యాధి అంటే, దీని పాలబడినవారు ఆరోజుకారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి ఎక్కువగా దాహం, ఆకలి, తరచుగా చక్కెరతోగాని, లేక చక్కెరలేకుండగాని మూత్రం బయలు వెడలటము, దురద మొదలైనవి వీనస్ ఛారమ్ అనేక సంవత్సరముల పరిశోధనల ఫలితంగా తయారు కాబడినది. దీన్ని వాడటంవల్ల వేనకు వేల మందిమృత్యుముఖమునుండి బయటపడ్డారు దీన్ని వాడితే రెండవలేక మూడవ రోజునుండేమూత్రంలో చక్కెర తగ్గించి అత్యధిక మూత్రంకూడా నివారిస్తుంది మూడురోజుల తర్వాత మీకు బాగా తేలిక ఇస్తుంది దీనికి పత్యంలేదు ఇన్‌జెక్షన్లు అవసరం లేదు. వివరములు గల ఇంగ్లీషు కరపత్రానికి వ్రాయండి ఉచితంగా పంపెదము.

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు.
ప్యాకింగు పోస్టేజి ఉచితము.

Venus Research Laboratory(A,P.W)
P O Box No 587 Calcutta



## అధైర్యపడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX—ADVICE పొందవచ్చును. మీకు ఉండుకొన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది.

డాక్టర్ రత్నంసన్స్, (Estd 1904)
మలకపేట బిల్డింగ్సు, హైద్రాబాద్ - 2.
(దక్కన్)







# ★ ఆకాశచిత్రాలు ★

మధ్య రమణకే తప్పిపడింది చిక్కంతా.

తనకు ప్రకాశంమీద కలుగుతున్న సందేహాల నివృత్తికోసం కమల అతన్ని వుపయోగించుకోసాగింది.

'ఒరేయ్ రమణా! నాకేమో అనుమానముగా వుంది. ఆయన తత్వం తీరు—అంతా మారిపోయింది. ఆయన ఎక్కడ యెవరికి ప్రైవేటు చెప్పేదీ నువ్వు కనుక్కో రావాలి' అంది కాలేజీకి బయలుదేరుతున్న తమ్ముడితో.

'బాగుంది!...ఈ అపరాధ పరిశోధన నా వల్లకాదు. అంటూ ఖచ్చితంగా చెప్పేసినా అతని మనసుకూడా పీక్కుతింటూనే వుంది.

సాయంత్రం కాలేజీ అయిపోగానే బావగారికి తెలియకుండా ఆయన్ని వెంబడించాడు. మధ్యలో ప్రకాశం కాఫీ హోటల్లో దూరి అరగంటయ్యేవరకూ బయటకు రాకపోవటం వలన రమణ ఏడుస్తూ రోడ్డువార తపస్సు చేయాల్సివచ్చింది.

సందుగొందులన్నీ దాటి ప్రకాశం ఓ చిన్న ఇంట్లోకి మాయమవటంతో ఇల్లు గుర్తుపెట్టుకుని రమణ వెనక్కి తిరిగాడు.

నాలుగడుగులు వేయకముందే అతని మిత్రుడొకడు భుజం మీద గట్టిగా చరచి 'ఎవరూ!...రమణేనా ఇలా షికార్లు తిరుగుతున్నది! అయితే ఇవేళ పిడుగుల్తో వర్షం పడాల్సిందే!' అని ఎత్తిపొడిచాడు.

'వేళాకోళాలు కట్టిపెట్టు...అదుగో కనపడుతోంది చూశావా? ఆ పెంకుటింట్లో మన కాలేజీలో చదివే విద్యార్థులెవరైనా వున్నారా!'

రమణ తనవాక్యం పూర్తిచేయకుండానే మిత్రుడు భూగోళం బ్రద్దలైనట్టు నిమిషం పాటు నవ్వాడు.

'భలే!...భలే!.. నీ కథ చాలాదూరం వరకూ వెళ్ళిందన్నమాట! ఆ యింట్లోనే మిస్ ఇండియా వుంటోంది. మీ బావగారు ఆమెకు ప్రైవేటు కూడా చెబుతున్నారు. మధ్య నీ పోటీ ఏమిటి? పలాయన మంత్రం పఠించు' అంటూ మళ్ళీ నవ్వడం మొదలెట్టాడు. పొంగివస్తున్న కోపాన్ని ఏలాగో అరికట్టాడు రమణ!...

ఛీ!.. చదువుకుంటే మాత్రం ఏంలాభం? సంస్కారం వుండక్కర్లేదూ! చివరకు మానాభిమానాలు గాలిలో కలిసిపోతాయి గామోలు!.. బావగారిమీద మొదటిసారిగా అతనికి అసహ్యం కలిగింది. ఇంటికి తిరిగొచ్చి పూసగుచ్చినట్టు కమలకు వివరించాడు. కమలకూడా 'అట్టో-ముక్కో' తేల్చేయాలనుకుంది.

* * *

[పెద్ద గాలిదుమారం రేగటంతో మబ్బులన్నీ చెదిరిపోయాయి. ఆకాశం తిరిగి తెల్లటి బట్టలా స్పష్టంగా తయారైంది. ఒక్క వాన చినుకుకూడా పడలేదు.]

మామూలుగా ప్రకాశం తొమ్మిదిగంటలకు వచ్చాడు.

'ఏమిరా ప్రకాశం!... మీ పెదనాన్న కూతురు—పెద్దమ్మ ఈవూళ్ళోనే వుంటున్నారట!.. నిజమేనా?' అని తండ్రి అడిగేసరికి ప్రకాశం హంతకుడిలా మొహంపెట్టి 'నాకు తెలియదే!' అన్నాడు.

'నీ కలాంటివన్నీ ఎక్కడ తెలుస్తాయిలే! పాపం! అన్నయ్య చనిపోయాక వాళ్లకుటుంబస్థితి బాగా దిగజారిపోయిందట!...ప్రస్తుతం ఎంత బాధపడుతున్నారో! ఆఅమ్మాయి కాలేజీలో చదువుతూందట!.. జరిగినదంతా మర్చిపోదాం. వాళ్లను రేపే మనింటికి తీసుకురావాలి – అందరూ కలిసివుండటమే మేలు! రేపు త్వరగా ఇంటికి వచ్చేయి.

ప్రకాశం తన చెవుల్ని తను నమ్మలేకపోయాడు.

'నిజంగానా నాన్నా!' అని అరిచాడు.

'నేను వేళాకోళానికైనా అబద్ధమాడను'

కమలకీ 'నాటక' మేమీ బోధపడలేదు.

'ఏమిటండిది?' అ నడిగింది.

'చెప్పడం మర్చిపోయాను. నాన్నకూ పెదనాన్నకూ తీవ్రమైన మనస్పర్థ లుండటం వలన రెండు కుటుంబాలమధ్య రాకపోకలుండేవి కావు ఆవేళ వచ్చిందికదూ సుశీల! జ్ఞాపకంవుందా?.. ఆమే మా పెద్దమ్మ కూతురు—! 'సుశీల మీ చెల్లెలా!...నాతో ఒక్క ముక్కైనా చెప్పలేదే! నేను విపరీతార్థాలు సృష్టించుకుని మనసు పాడుచేసుకున్నాను'

కమలకళ్లు ఆనందబాష్పాలతో నిండిపోయాయి.

'సరే!...ఆడదానినోట ఆవగింజయినా దాగదట!...

నీతో ముందే చెబితే అది కాస్తా నువ్వు నాన్నకు అందజేస్తావు.

ఇంతకీ మధ్య నీబాధేమిటి?'

కమల అంతా వివరించింది.

అంతావిని ప్రకాశం పకపక నవ్వాడు. రమణ, కమల కూడా అతన్తో కలిశారు. ★